క్లుప్తంగా

రైతులకు యూరియా పంపిణీ



యూరియా బస్తాలు అందజేస్తున్న అధికారులు, నాయకులు

సంతబొమ్మాళి: సంతబొమ్మాళి గ్రామ సచివాలయ పరిధిలో రైతులకు మంగళవారం యూరియా, డీఏపీ బస్తాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మెండ అప్పారావు, కూసెట్టి కాంతారావు, అల్లు రమేష్, చల్ల జగ్గారావు, పప్పు కష్టారావు, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

నియోనటల్ వాహనం తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారి

టెక్కలి రూరల్: నవజాత శిశువుల సంరక్షణకు ప్రవేశపెట్టిన నియోనటల్ 108 వాహనాన్ని మంగళవారం జిల్లా మేనేజర్ హరిప్రసాద్ తనిఖీచేశారు. టెక్కలి జిల్లా ఆస్పత్రి ఆవరణలో ఉన్న ఈ వాహనంలో పరికరాల పనితీరుపై ఆరా తీశారు. మందులు, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఒక్క నియోనాటల్ వాహనం మాత్రమే ఉందని, అవసరమైన వారు సద్వినియోగం చేసుకునేలా మెయింటెనెన్స్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఎంటీ డి.శ్రీనివాసరావు, పైలట్ జె.శశిభూషణ పాల్గొన్నారు.

దివ్యాంగునికి చేయూత



సాయం అందిస్తున్న నరేష్‌కుమార్

ఇచ్ఛాపురం: రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు పోగొట్టుకున్న గాలి కృష్ణారావుకు రష్యాలో పనిచేస్తున్న ధర్మపురం గ్రామస్తులు అండగా నిలిచారు. గ్రూప్ సభ్యులు చట్టి నరేష్‌కుమార్ మంగళవారం రూ.6 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.


ప్రభుత్వ సాయం అందజేత



లోకనాథం కుటుంబానికి చెక్ అందిస్తున్న తహసీల్దార్

సోంపేట: మండలంలోని జింకిభద్ర గ్రామానికి చెందిన యువకుడు తామాడ లోకనాథం ఇటీవల కువైట్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో మృతిచెందాడు. అతని కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. గతంలో రూ.5 లక్షల చెక్కును ఎమ్మెల్యే బి.అశోక్ అందజేశారు. మంగళవారం మరో రూ.5 లక్షల చెక్కును తహసీల్దార్ కె.విజయ్‌కుమార్ లోకనాథం తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిత్రాడ శ్రీనివాసరావు, వార్డు మెంబర్లు నిమ్మన వెంకటరావు, తెలుకుల శ్రీనివాసరావు, పుచ్చల కృష్ణారావు పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న కమిటీ సభ్యులు

సోంపేట: మండలంలోని బారువ గ్రామానికి చెందిన తెలుకుల వంశీ నాలుగు రోజుల క్రితం బారువ కంభ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం శ్రీకాకుళంలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో బారువ గ్రామానికి చెందిన పెద్ద అమ్మవారు కమిటీ సభ్యులు రూ.26,200లను మంగళవారం వంశీ తల్లిదండ్రులు కిశోర్, లక్ష్మిలకు అందజేశారు.

అమృత కలశాల వితరణ



జమ్మాలమ్మకు సరుకులు అందిస్తున్న సత్యసాయి సభ్యులు

కవిటి: రాజపురం సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో కమలాయిపుట్టుగకు చెందిన పఠాని జమ్మాలమ్మ, కర్రివానిపాలెంకు చెందిన సూర్ని శాంతమ్మ, కవిటి తొత్తిడిపుట్టుగకు చెందిన ఎర్ర చంద్రులకు సత్యసాయి అమృత కలశం పథకం కింద నెల రోజులకు సరిపడా రేషన్ సరుకుల కిట్లను మంగళవారం అందించారు. కార్యక్రమంలో సత్యసాయి సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

● హెల్మెట్ తప్పనిసరి



ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని కోటబొమ్మాళి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత అన్నారు. మంగళవారం కోటబొమ్మాళి మెయిన్‌రోడ్డులో హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు లఖినేని శ్రీనివాసులు, ఏజీపీ ఎస్.తిరుపతి, న్యాయవాదులు యు.తిరుమలరావు, వాన నేతాజీరావు, పల్లి వాసుదేవరావు, బి.ధర్మారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

– కోటబొమ్మాళి

● ప్రవాహపు 'దండు'



ఇటీవల కురిసిన వర్షాలకు ఇచ్ఛాపురంలోని దండు గెడ్డ ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఆంధ్రా, ఒడిశా గ్రామాలను అనుసంధానం చేస్తూ పారుతున్న ఈ గెడ్డలో సోమవారం రాత్రి జోరుగా వరద నీరు చేరడంతో పంట భూములకు సాగునీటి సమస్యకు పరిష్కారం లభించినట్లయ్యింది. ఇన్నాళ్లూ నీరు లేక అన్నదాతలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఎట్టకేలకు గెడ్డల ద్వారా నీరు అందుబాటులో రావడంతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

– ఇచ్ఛాపురం రూరల్

● 'బండెడు' కష్టాలు



టెక్కలి ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ప్రతి రోజూ వందలాది ట్రాక్టర్లు బారులు తీరుతున్నాయి. లోడ్ పూర్తి చేసేందుకు రేయింబవళ్లు పడిగాపులు కాయాల్సి వస్తోంది. మరో పనికి ట్రాక్టర్‌ను వినియోగించకుండా రేయింబవళ్లు అక్కడే ట్రాక్టర్లు ఉంచాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడిందని యజమానులు చెబుతున్నారు. ఇదే సమయంలో ట్రాఫిక్ చిక్కులూ తప్పడం లేదని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– టెక్కలి

● నైపుణ్య ప్రాప్తిరస్తు



జాతీయ విద్యావిధానం 4వ వార్షికోత్సవం సందర్భంగా శిక్షా సప్తాహ్ కార్యక్రమం పాఠశాలల్లో కొనసాగుతోంది. దీనిలో భాగంగా మంగళవారం నందిగాం మండలం పెద్దతామరాపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పునాది అభ్యసన, సంఖ్యా శాస్త్రం నైపుణ్యాల అభివృద్ధి సాధనకు అవసరమైన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్స్ తయారు చేసి ప్రదర్శించారు.

– నందిగాం

● టాపర్‌కు సత్కారం



సంతబొమ్మాళి మండల పరిధిలో 10వ తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి జవ్వాది జాహ్నవిని మనబడి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. మెమెంటో, నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు చిన్నవాడు, అర్జునుడు, ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, మనబడి ప్రతినిధులు రెడ్డి సూరిబాబు, గేదెల శివారెడ్డి, ఇప్పిలి అప్పన్న, జగదీష్ పాల్గొన్నారు.

– సంతబొమ్మాళి

ప్రారంభానికి.. ఎదురుచూపులు

- గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం పూర్తి చేసుకున్న అర్బన్ హెల్త్ సెంటర్లు
- అందుబాటులోకి తీసుకురావాలని స్థానికుల విజ్ఞప్తి



నిర్మాణం పూర్తి చేసుకున్న కోసంగిపురం అర్బన్ హెల్త్‌సెంటర్

కాశీబుగ్గ: పట్టణ ప్రాంత పేదలకు సంపూర్ణ వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రాంతాలను యూనిట్‌గా తీసుకుని పలు చోట్ల అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణం చేపట్టాయి. ఇందులో భాగంగా పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో మూడు యూహెచ్‌సీల నిర్మాణం చేపట్టారు. పనులు పూర్తి కావడంతో త్వరితగతిన వీటిని ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

ఏయే సేవలంటే..

అర్బన్ హెల్త్ సెంటర్లను పూర్తి డిజిటలైజేషన్ చేయబడిన ఆరోగ్య కేంద్రాలుగా పేర్కొనవచ్చు. వైద్యులు, ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, నర్సులు, ఎఫ్‌ఎన్‌ఓ, ఎంఎన్‌ఓలు సేవలు అందిస్తారు. వీరేకాకుండా టెలి మెడిషన్ పద్ధతులలో సంబంధిత స్పెషలిస్టు మన ఆరోగ్య సమస్యలను విని వాటికి ఆన్‌లైన్‌లో సేవలు అందిస్తారు. ఉచిత వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందిస్తారు. చిన్న పిల్లల వ్యాక్సిన్లు భద్రపరిచి అవసరమైన వారికి అందజేస్తారు.

పలాస–కాశీబుగ్గలో..

శ్రీకాకుళం నగర పాలక సంస్థలో మూడు అర్బన హెల్త్‌సెంటర్‌లు నిర్మాణాలు పూర్తి చేసుకుని ప్రారంభించి సేవలు సైతం అందిస్తున్నారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో మూడు అర్బన్ హెల్త్‌సెంటర్‌లు మంజూరుకాగా అందులో ఒకటి మధ్యలోనే పనులు నిలిచిపోగా మిగిలిన రెండు పనులు పూర్తయ్యాయి. 1వ వార్డు జాతీయ రహదారిపై ఉన్న మొగిలిపాడు వద్ద రూ.85 లక్షలతో నిర్మాణం పూర్తి సేవలకు సిద్ధం చేశారు. రెండు వేల ఐదు వందల మంది జగనన్న కాలనీలో ఉన్న ప్రజల కోసం రూ.85 లక్షలతో సరికొత్త అర్బన్ హెల్త్‌సెంటర్‌ను ఏర్పాటు చేశారు. స్థల వివాదం పరిష్కారమై పనులు మధ్యలో నిలిపివేసిన సూదికొండ అర్బన్ హెల్త్ సెంటర్ పనులు సైతం ప్రారంభిస్తే మేలు జరుగుతుందని ఆ ప్రాంతవాసులు చెబుతున్నారు.



ప్రారంభానికి సిద్ధమైన మొగిలిపాడు యూపీహెచ్‌సీ భవనం

వెంటనే ప్రారంభించాలి..



జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మెడికల్ హబ్‌గా పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ తయారైంది. రూ.85 కోట్ల తో కిడ్నీ పరిశోధన కేంద్రం నిర్మించారు. మందస, వజ్రపుకొత్తూరు మండలాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో మూడు అర్బన్ హెల్త్ కేంద్రాలు నిర్మించారు. ఒక చోట పనులు మధ్యలో నిలిచిపోయాయి. మిగిలిన వాటిని అందుబాటులోకి తీసుకురావాలి.

– పి.వి.సతీష్‌కుమార్, ఏఎంసీ చైర్మన్, పలాస

మోదం.. ఖేదం



కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వేతన జీవులకు నిరాశ కలిగించేలా, కార్పొరేట్ సంస్థలకే కొమ్ముకాసేలా ఉందని, రైల్వేజోన్ అంశాన్ని విస్మరించిందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేయగా, కూటమి ప్రభుత్వానికి చెందిన పలువురు నాయకులు మాత్రం బడ్జెట్ కేటాయింపులను స్వాగతిస్తున్నారు.

– వజ్రపుకొత్తూరు/కవిటి/కాశీబుగ్గ

వేతన జీవులకు నిరాశ



కేంద్ర బడ్జెట్ వేతన జీవులకు నిరాశ కలిగించింది. ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదలకు అనుగుణంగా మినహాయింపులు ఉండకపోవడం అసంతృప్తి కలిగించింది. 15 ఏళ్ల క్రితం ఉన్న పన్నుల విధానమే ఇంకా అమలు చేస్తుండటం నిరాశ కలిగించే విషయం. ఉద్యోగులకు ఎలాంటి రాయితీలు ప్రకటించలేదు.

– మజ్జి చినబాబు, వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

కార్పొరేట్ సంస్థలపైనే ప్రేమ..



కేంద్ర బడ్జెట్‌లో కార్పొరేట్ సంస్థలపైనే ప్రేమ చూపారు. వారికి ఇచ్చిన రాయితీలు బడుగు బలహీన వర్గాల వద్దకు వచ్చేసరికి కనిపించలేదు. వేతన జీవులు నూతన పెన్షన్ విధానం సవరిస్తారని ఎదురు చూసినా ఆ ఊసే లేదు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తారని ఆశించినా నిరాశే ఎదురైంది. వెనుకబడి జిల్లాలకు కేటాయింపులు లేకపోవడం అన్యాయం.

– మెట్ట మోహనరావు, యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు, వజ్రపుకొత్తూరు

స్వాగతిస్తున్నాం..



కేంద్ర బడ్జెట్‌లో అమరావతికి, పోలవరానికి పెద్దపీట వేయడం గొప్ప విషయం. రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక నిధులు, విశాఖ–చెన్నై కారిడార్‌లకు నిధులు కేటాయించిన ప్రధాని మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు.

– వైశ్యరాజు మోహనరాజు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ

రైల్వే జోన్ ఏదీ?



24 మంది ఎంపీల్ని గెలిపించి ఎన్డీయేలో భాగస్వామ్యమైన ఆంధ్రప్రదేశ్‌కు ఈ బడ్జెట్‌కు తీవ్ర నిరాశ ఎదురైంది. విశాఖకు రైల్వే జోన్ కేటాయిస్తారన్న ఆశలు అడియాశలయ్యాయి. ఇంతకన్నా తక్కువ ఎంపీలు ప్రాతినిధ్యం ఉన్న బీహార్‌కు ఇచ్చిన ప్రాధాన్యత ఆంధ్రప్రదేశ్‌కు దక్కకపోవడం శోచనీయం. విభజన చట్టం హామీల్ని కూడా నెరవేర్చలేని అసమర్థ ప్రభుత్వమా అనే అనుమానాలు రేకెత్తించేలా ఏపీకి బడ్జెట్‌లో కేటాయింపులు కనిపిస్తున్నాయి.

– పీఎం తిలక్, మాజీ ఎంపీపీ, కవిటి మండలం

అభయం సంఘం ఔదార్యం



బ్లడ్ ప్యాకెట్లు అందజేస్తున్న దృశ్యం

టెక్కలి: టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, పలాస కిడ్నీ ఆసుపత్రుల్లో పలువురు రోగులకు మంగళవారం టెక్కలికి చెందిన అభయం యువజన సేవా సంఘం సభ్యులు రక్తాన్ని సమకూర్చారు. పలాస కిడ్నీ ఆసుపత్రిలో డయాలసిస్ చేసుకుంటున్న నందిగాం మండలం ఆనందపురం గ్రామానికి చెందిన పొట్నూరు మహాలక్ష్మికి, టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో కాలు ఆపరేషన్ చేయించుకుంటున్న సంతబొమ్మాళి మండలం బోరుభద్ర గ్రామానికి చెందిన సవిరిగాం శ్రీనివాసరావుకు అభయం సేవా సంఘం అధ్యక్షుడు దేవాది శ్రీనివాసరావు వివిధ బ్లడ్ బ్యాంకులను సంప్రదించి రక్తాన్ని సమకూర్చారు. టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి డాక్టర్ బి.సునీత చేతుల మీదుగా సిబ్బంది మంజుల, శ్రీనివాస్, శ్రీధర్, అభయం సభ్యుడు జె.శశిభూషణ్ సమక్షంలో రోగుల బంధువులకు రక్తం ప్యాకెట్లు అందజేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 14, 15, 16 తేదీల్లో టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు.

ఆధార్ శిబిరాలకు స్పందన



లఖిదాసుపురంలో సేవలపై ఆరా తీస్తున్న ఎంపీడీఓ రాజారావు

నందిగాం/ఇచ్ఛాపురం/ఇచ్ఛాపురం రూరల్/కంచిలి: ఆధార్ అప్‌డేట్ కోసం సచివాలయాల వద్ద నిర్వహిస్తున్న శిబిరాలకు మంచి స్పందన లభిస్తోందని నందిగాం ఎంపీడీఓ టి.రాజారావు అన్నారు. మంగళవారం హరిదాసుపురం, లఖిదాసుపురం, దిమ్మిడిజోల, కొత్తగ్రహారంలో నిర్వహించిన శిబిరాలను పరిశీలించి సేవలపై ఆరా తీశారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటి పరిధిలోని కార్జివీధి, బెల్లుపడ కాలనీ–3 సచివాలయాల పరిధిలో 35 మంది ఆధార్‌సేవలు పొందారని మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ తెలిపారు. ఇచ్ఛాపురం మండలం మండలం అరకబద్ర, మండపల్లిలో నిర్వహించిన ప్రత్యేక ఆధార్ శిబిరాలను ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్ పరిశీలించారు. కంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాల, మఠం సరియాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆధార్ శిబిరాలను ఎంపీడీఓ వి.నీరజ పరిశీలించారు.

● స్ఫూర్తిప్రదాతలకు వందనం



స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ జీవితం స్ఫూర్తిదాయకమని ఉపాధ్యాయులు, విద్యార్థులు నినదించారు. మంగళవారం చంద్రశేఖర్ ఆజాద్, బాలగంగాధర్ తిలక్ జయంతి వేడుకల్ని పెద్ద ఎర్రగోవిందపుట్టుగ ప్రాథమిక పాఠశాల, కవిటి కల్యాణి పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఆజాద్ చిత్రపటం వద్ద చిన్నారులు కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు. ఇచ్ఛాపురం మండలం ఎం.తోటూరు ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం కొత్తపల్లి సుహాశ్‌చంద్ ఆధ్వర్యంలో విద్యార్థులు తిలక్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. – కవిటి/ఇచ్ఛాపురం రూరల్

ప్రెస్‌క్లబ్ కార్యవర్గ ఎన్నిక

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ ప్రోగ్రెసివ్ ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం స్థానిక ఫంక్షన్ హాలులో జరిగింది. అధ్యక్షుడిగా దేవ విశ్వేశ్వరరావు(నాని), కార్యదర్శిగా నల్ల నారాయణరావు, గౌరవ అధ్యక్షుడిగా వంకల రాజారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు నల్లారి అశోక్, పువ్వల శివజ్యోతి, తలగాపు వెంకటరమణ, నందేడి చంద్రరావు, ఈశ్వర పాత్రో, గంగుశ్రీనివాస్, మద్దిల రామారావు, బమ్మిడి చలపతి, శ్రీనివాస్, పానిల శోభన్‌బాబు, మురళీ, రాజు, అనంత్, యోగి, వేణు, తిరుపల, వాసు, గోపి తదితరులు పాల్గొన్నారు.

పెంటపోలమ్మతల్లికి చల్లదనం



అంబేడ్కర్‌నగర్‌లో పెంటపోలమ్మ చల్లదనం

కాశీబుగ్గ: కాశీబుగ్గ హరిజన వీధి అంబేడ్కర్ నగర్‌లో పెంట పోలమ్మతల్లి చల్లదన ఉత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. స్థానిక పెద్దలు, మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి చల్లదనం చేశారు. అదేవిధంగా మందస మండలం మూలిపాడులో అమ్మవారికి చల్లదనం నిర్వహించారు.

సోంపేట ఎస్‌ఈబీ సీఐకు ప్రశంసలు



సీఐ జైభీమ్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న జేడీ

సోంపేట: సోంపేట ఎస్‌ఈబీ సీఐ జైభీమ్‌కు శ్రీకాకుళం ఎస్‌ఈబీ జాయింట్ డైరెక్టర్ గంగాధరం ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గంగాధరం మాట్లాడుతూ విధి నిర్వహణలో అందించిన సేవలు గుర్తించి సెబ్ కమిషనర్ ఎం.రవిప్రకాష్ ఈ ప్రశంసాపత్రం పంపించినట్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం శ్రీకాకుళంలో జరిగిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో సీఐతో పాటు కానిస్టేబుళ్లు కాంతారావు, రాజ్‌కుమార్‌లకు ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు.

సామాజిక భవనం అభివృద్ధికి వితరణ

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని ఎం.గడూరు పరిధిలో ఉన్న సందిపురం గ్రామానికి చెందిన పిన్నాసి కామరాజు ఇటీవల మృతి చెందడంతో ఆయన జ్ఞాపకార్థం సామాజిక భవనం అభివృద్ధికి కుటుంబ సభ్యులు మంగళవారం రూ.50 వేలు వితరణగా అందజేశారు.

ఆకట్టుకున్న గణిత దశావధానం



దోలగోవిందపురంలో గణిత అవధానం నిర్వహిస్తున్న మద్దు తిరుపతిరావు

కంచిలి/ఇచ్ఛాపురం రూరల్/కవిటి: కంచిలి మండలం డోలగోవిందపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత అవధాని మద్దు తిరుపతిరావు నిర్వహించిన గణిత దశావధానం ప్రక్రియ ఆకట్టుకుంది. సప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా రెండోరోజైన మంగళవారం నైపుణ్యాభివృద్ధి అంశంలో భాగంగా విద్యార్థులకు హెచ్‌ఎం యు.రమేష్ ఆధ్వర్యంలో గణితంలో మెలకువలు నేర్పారు. కంచిలి ప్రాథమిక పాఠశాలలో సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన టీఎల్‌ఎం ప్రదర్శన, నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమాలను ఎంఈఓలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు పరిశీలించారు. హెచ్‌ఎం ఆర్.కామరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇచ్ఛాపురం మండలం కొళిగాంలో పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం నరేంద్రనాథ్ పట్నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కవిటి మండలం ముత్యాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులచే మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు స్ఫూర్తిదాయకం



బల్లిపుట్టుగలో చాందిని అమ్మమ్మకు ఆర్థిక సాయమందిస్తున్న సభ్యులు

కవిటి: స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసి వంద సేవా కార్యక్రమాలు పూర్తి చేసుకోవడం అభినందనీయమని బల్లిపుట్టుగ సర్పంచ్ శ్రీకన్యాదొళాయి, వైఎస్సార్ సీపీ నేత రజనీకుమార్ దొళాయి అన్నారు. ఇచ్ఛాపురం, కవిటి మండలాల సంయుక్త గ్రామమైన సన్యాసిపుట్టుగ కేంద్రంగా పనిచేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ 2019లో ఏర్పాటై 100వ సామాజిక సేవా కార్యక్రమం బల్లిపుట్టుగలో మంగళవారం నిర్వహించారు. ఇప్పటివరకు రూ.10 లక్షల వరకు వివిధ సేవాకార్యక్రమాల ద్వారా వితరణ అందించినట్టు వివరించారు. తాజాగా బల్లిపుట్టుగకు చెందిన మానేక చాందినీకి చికిత్స నిమిత్తం రూ.12,000 ఆర్థికసాయాన్ని అందించారు. ఈమె వైద్యానికి రూ.1.5లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారని, దాతలు మానవతాదృక్పథంతో స్పందిస్తే ఆ బాలిక జీవితానికి వెలుగులు నింపవచ్చని గ్రామస్తులు కోరుతున్నారు.

వృద్ధాశ్రమానికి ఫ్రీజర్ వితరణ

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధిలోని కోసంగిపురం కూడలి వద్ద లలితాశ్రమానికి పలాస–కాశీబుగ్గ జంట పట్టణాలకు చెందిన కన్నన్ కాష్యూ గ్రూప్‌కు చెందిన మల్లా బాబూరావు, సుదేష్ణ దంపతులు రూ.80వేలు విలువైన ఫ్రీజర్‌ను మంగళవారం వితరణగా అందించారు. కార్యక్రమంలో ఆశ్రమాధిపతి చిన్ని కృష్ణ పాల్గొన్నారు.